


# వేట

రంపమాచవరం ట్రావెలర్స్ బంగాళా పారాచుట్‌వాల్ దగ్గర నిల బడి చూస్తున్నాం నేనూ, మనోహర్‌రెడ్డి.

మనోహర్‌రెడ్డి సబ్-ఇన్‌స్పెక్టర్ ఆ వూరికి.

మేం ఉన్నది గుట్టలాంటి ఎత్తైన ప్రదేశం మీద అవటం వల్ల కింద పల్లెటూరు, చుట్టూ అడవి, కొండలూ— ఎంతో ఆహ్లాదంగా ఉంది చూడడానికి.

ఇంకో గంటలో నా ప్రయాణం.

ఇద్దరం కబుర్లు చెప్పుకుంటున్నాం.

"చాలా థాంక్స్" అన్నాడు రెడ్డి.

"దేనికి ?" కళ్ళు తిప్పకుండానే అడిగాను.

"బిజీ 'బీ'వి. రెండ్రోజులు నాతో గడిపినందుకు."

"వెధవ సెంటిమెంట్స్ టచ్ చెయ్యకు" అన్నాను.

నిజంగా ఆ ఆఫీసు పనితో బోరెత్తిపోయాను.

ఈ రెండ్రోజులూ భలే రిలాక్సయానులే.

ఇంతలో కింద దూరంగా వీధిలో ఒక గుంపు ఒకణ్ని తన్నుకుంటూ వెళుతున్నారు.

నేను కొంచెం కంగారుగా "అరే, అదేమిటి" అన్నాను.

అలాంటివి చాలా చూసిన వాడవటంచేత రెడ్డి తనున్న చోటునుంచి కదలకుండానే వాచ్‌మన్‌ని పిలిచి అదేమిటో చూసి రమన్నాడు.

దెబ్బలు తింటున్నవాడు. నల్లగా మొద్దులా ఉన్నాడు. దూరంనుంచి కూడా స్పష్టంగా కనబడుతున్నాడు వాళ్ళావిడ అనుకుంటా గుమ్మంలో నిలబడి చేతులు తిప్పుకుంటూ అరుస్తూంది. ఇంతలో ఇద్దరు పోలీసులొచ్చి వాణ్ని విడిపించారు. గుంపు చెదిరిపోయింది.

వాచ్‌మన్ వచ్చి జరిగింది చెప్పాడు.

కిరాణాషాపు యజమాని. అతడు అన్నిట్లోనూ కత్తియేనట. వడ్డీ

వ్యాపారం కూడా చేస్తాడట. ఆ రోజు వడ్డీ కట్టలేదని ఎవడిదో ఇంట్లో సామాను తెచ్చెయ్యడంతో గొడవ...

"ఇంకో నాలుగు తగల్నివ్వ వలసింది, బుద్ధొచ్చి ఇంకెప్పుడూ ఇలా చేసేవాడు కాదు" అన్నాను.

"మేమున్నది ఇలాంటి వాటిని ఆపు చెయ్యటానికి" అన్నాడు రెడ్డి నవ్వుతూ. "చిన్న వూరైనా ఇక్కడ పోలీస్ స్టేషన్ పెట్టింది వాడికత్తులతో, వడ్డీ వ్యాపారస్తుల తలలు తెగిపడకుండా ఆపు చెయ్యటానికి."

ఆ మాటలకే నేను కొంచెం ఆవేశపడి, "ఈ అమాయకుల్ని మోసం చేసేవాళ్ళని రక్షించే హక్కు నీకు లేదు" అన్నాను.

రెడ్డి నవ్వాడు. "నేను రక్షిస్తూంది శాంతి భద్రతల్ని."

"ఆ పేరుతో విప్లవం రాకుండా అడ్డు పడుతున్నావ్. ఇలా 'కొద్ది కొద్దిగా' ఎదురు తిరగటమే ఒక మహా ప్రభంజనానికి నాంది దాన్ని మొగ్గలోనే తుంచేస్తున్నావ్."

రెడ్డి మొహం మీద నవ్వు చెదిరిపోలేదు.

"ఈ గాలి అడవుల్లో బాగా పాకితే పాకవచ్చుగాక. కానీ ఇది ఈ ప్రాంతం దాటి మీ పట్టణం వరకూ రాదు. అంత దూరం వరకూ కూడా పాకదు."

"ఎందుకు ?"

"నాగరికత రివోల్టుకి ఎదురుగా పని చేస్తుంది కాబట్టి"

"ఇది కొత్త సిద్ధాంతమా !"

"కాదు. అనుభవం నేర్పిన పాఠం."

* * *

ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లోకూడా నుదుటి మీద చిరు చెమట పట్టింది అతి కష్టంమీద దాన్ని కంట్రోల్ చేసుకుని "వెళ్ళండి— దయ చేసి" అన్నాను ఇంగ్లీషులో.

శ్యామ్‌లాల్ శ్యామ్‌జీ నవ్వాడు.

"మీరలా అంటే ఎలా సాబ్ ? ఏదో విధంగా పని జరిగేలా చూడాలి."

లేచి నిలబడి "సరే, చూస్తాన్లెండి" అన్నాను, ఇక వెళ్ళవచ్చు అన్నట్టుగా. మరిక చేసేది ఏమీ లేనట్టు లాల్ లేచి వెళ్ళిపోయాడు.

అతనంత తొందరగా వదిలి పెడతాడనుకోలేదు.

వదిలిపెట్ట లేదుకదా— మరుసటి రోజు మళ్ళీ వచ్చాడు.

"శ్యామ్‌జీ సాబ్" అన్నాను. "నేనీ సీట్లో ఉండగా మీ పని అవుతుందని ఆశ పెట్టుకోకండి."

"సాబ్...సాబ్."

"చూడండి, శ్యామ్‌జీ ! మీ పెట్టుబడి లక్ష. మీకు మేము కోటి రూపాయలకి గ్యారంటీ ఇవ్వాలా ?"

"దానికి సరిపడా సరుకు విదేశం నుంచి వస్తుంది కద సాబ్. నూనె గింజల కెంత గిరాకీ ఉందో మీకు తెలియనిది కాదు కదా."

"ఆ సరుకెలా ఉంటుందో కూడా మీరు చూడరు. ఇక్కడే ఇంకెవరితోనో కాంట్రాక్ట్ చేసుకుంటారు. బొంబాయిలో సరుకు దిగకముందే అమ్మకం జరిగి పోయిందన్నమాట. దీనికి మేం సాయం చెయ్యాలిసింది."

"మరి గవర్నమెంట్ పాలసీ—..."

"గవర్నమెంట్, గవర్నమెంట్-గవర్నమెంట్" అరిచాను.

"నేనూ ఆ గవర్నమెంట్‌లో ఒక భాగాన్నేనండి. అందుకే మీ పని జరగదూ అంటున్నాను."

శ్యామ్‌జీ నవ్వాడు.

ఇంట్లో పట్టు బాలీసుల మధ్య కూర్చుని, ఫోన్‌మీద కోట్లకోట్ల వ్యాపారం చేసేవాడు టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ నుంచి రెండు నెలల ఫోన్ బిల్లు కట్టలేదని ఫోన్ కాల్ వచ్చినప్పుడు నవ్వినవాడిలా నవ్వాడు.

లేచి, చేతులు జోడించి "మంచిది. వెళ్ళొస్తాను సాబ్" అన్నాడు.

తల పైకెత్తాను.

అదే నవ్వు.

తల దించుకుని "మంచిది" అన్నాను.

అరగంట తరువాత ఇంటర్‌కమ్‌లో మానేజింగ్ డైరెక్టర్ నించి పిలుపొచ్చింది.

బయట కారిడార్‌లో ఉన్న సోఫాలో ష్యామ్‌జీ కూర్చుని ఉన్నాడు.

తల వంచుకుని వడివడిగా లోపలికి వెళ్ళాను.

కొద్దిగా సుగంధ మిళితమైన చల్లటి గాలి.

"కూర్చో."

ఎదుటి కుర్చీలో కూర్చున్నాను.

"దాదాపు పది సంవత్సరాల నుంచీ ఈ ఆర్గనైజేషన్‌లో పనిచేస్తున్నావ్. ఏ విషయాన్ని ఎలా పరిశీలించాలో నీకు తెలుసు" ఆగాడు.

ఎటు తీసుకెళ్ళడంకోసం దీన్ని మొదలుపెట్టాడో తెలిసిన నేను మాట్లాడలేదు.

"శ్యామ్‌లాల్ ఘన్‌శ్యామ్‌జీ, మనకున్న కొద్ది వాల్యుబుల్ కస్టమర్స్‌లో ఒకరు. అటువంటి వాళ్ళ సాయంవల్లే మనకింత పేరొచ్చింది. అవునా! అటువంటి వాడు చిన్న పనికోసం నా వరకూ వచ్చేడంటే— అసలలా రావలసి వచ్చిందంటే— మన ఆర్గనైజేషన్‌లో ఎక్కడో ఏదో లోపం ఉన్నదన్న మాట."

"ఆర్గనైజేషన్‌లో లేదు. సంపూర్ణ స్వేచ్ఛాయుతమైన అభివృద్ధి గమ్యంగా గల సమాజాన్ని సృష్టించుకోలేని మన అశక్తతలో ఉంది— క్షమించు మార్క్స్."

ఆవేశాన్ని అణచుకుంటూ అన్నాను. "లక్ష రూపాయలతో రెండు కోట్ల వ్యాపారం ఎలా చేయగలడు సర్ అతడు? ఆ సరుకుని మనకి

తాకట్టు పెట్టటం మాట అలా ఉంచండి. కనీసం అతడు కూడా కళ్ళతో చూడడే... కేవలం ఫోన్స్‌మీద అమ్మకం జరిపే వ్యాపారం చేస్తాడే..."

"నూనె గింజల ధర రోజు రోజుకి ఎలా పెరిగిపోతూందో నీకు తెలుసు. కోటి యాభై లక్షలవరకూ బొంబాయిలో దిగగానే రెండు కోట్లకి అమ్ముతాడు. అంటే యాభై లక్షలు లాభం. అందులో ఇరవై లక్షలు మనకి కమీషన్ కిందా, వడ్డీకిందా అతడు చెల్లిస్తాడు. ఇందులో మనకొచ్చే నష్టం ఏమిటి ?"

"మనకు నష్టంరాదు. వచ్చేది జనానికి. నాలుగు రూపాయలకి కేజీ అమ్మేది ఆరురూపాయలవుతుంది అంతే. పోతే వ్యవస్థ అనబడే నవ్వారు మంచపు లోటుపాట్ల సందుల్లో ఇంకో నల్లి మరింత బలం పుంజుకుం టుంది."

"వెళ్ళి స్టే ఆర్డర్ ఇవ్వు."

"క్షమించండి, సర్. ఇవ్వలేను."

ఎమ్. డి. చివాలున తలయెత్తి క్షణంసేపు సూటిగా చూసి, తిరిగి ఫైళ్ళలోకి తల దించుకుని, "మంచిది, ఆ ఫైలు పట్వారీకి ట్రాన్స్‌ఫర్ చెయ్యి" అన్నాడు.

నా మొహం తెల్లగా పాలిపోయింది

ఒక సీనియర్ ఆఫీసర్‌కి ఇంతకన్నా ఘోరమైన అవమానం ఉం డదు.

తల వంచుకుని బయటికొచ్చాను. షామ్‌జీ లేడు

కాబిన్ దగ్గిరకొస్తూంటే, గ్లాసు అద్దాల వెనుక పట్వారీతో నవ్వుతూ మాట్లాడుతూ కనిపించాడు.

ఫైల్ పంపించేసి, తెల్లకాగితం తీసుకుని వ్రాయటం మొదలు పెట్టాను.

"నన్ను మీలో ఒకడిగా చూసుకుంటూ, మీరందించిన సహాయా

నికి, స్నేహాభిమానాలకీ, కృతజ్ఞత తెలుపుకుంటూ నేను ఇస్తూన్న ఈ రాజీ నామాన్ని స్వీకరించ వలసిందిగా యాజమాన్యాన్ని ప్రార్థిస్తున్నాను."

సంతకం పెట్టి, ఇంటర్‌కమ్‌లో పి ఎ తో మాట్లాడాను.

"లేదు సార్, ఎమ్. డి. ఇప్పుడే వెళ్ళిపోయారు"

టైమ్ చూస్తే అయిదయింది.

కాగితం కోటు జేబులో పెట్టుకుని బయటకొచ్చాను.

మనసు చాలా ప్రశాంతంగా, రిలీఫ్‌గా ఉంది. తుఫాను వెళ్ళిపో యిన తరువాత ప్రశాంతత.

ఇంటి కొచ్చేసరికి అరుణా, పాపా తయారుగా ఉన్నారు.

ఆఫీసర్ మూడ్‌నీ, వ్యవహారాల్నీ ఇంటికి తీసుకురావటం మొద ట్నుంచీ అలవాటులేదు

పాప చెక్కిలిమీద సుతారంగా ముద్దు పెట్టుకుని, ఆ పనే మళ్ళీ పాప చూడకుండా చేయటానికి ప్రయత్నిస్తూ "ఏమిటి తయారయ్యారు" అన్నాడు.

"అదేమిటి నాన్నా, బజారు వెళదాం అన్నావుగా."

"తప్పకుండా, స్వీటీ."

అంతలో ఫోన్ వచ్చింది మధు—

"నీకే చేద్దామనుకుంటున్నాను"

"ఏమిటి విశేషం ?"

"సపోజ్—" అన్నాను "నేను ఉద్యోగం మానేసి నీతో కలిసి ప్రాక్టిస్ పెడతాననుకో...ఎంతిస్తావ్ ?"

"నువ్వు రావాలేకానీ, ఎంతయినా ఇస్తాను"

"బీ కమర్షియల్."

"అయిదొందలు మినిమం—ఇరవై శాతం షేరు."

"అయిదొందలు. నా జీతంలో అయిదో వంతు."

"ఆలోచిస్తాను..." ఫోన్ పెట్టేశాడు.

వెనక్కి తిరిగితే అరుణ...నవ్వుతూంది.

"ఏమిటి తీరిగ్గా జోకులేస్తున్నారు."

నేనూ నవ్వేసి వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్ళాను. చెప్పిన మరుక్షణం ఆ నవ్వుతున్న మొహం ఎలా మారుతుందో నాకు తెలుసు. నెమ్మదిగా చెప్పాలి.

అరగంటలో తయారయ్యాను.

పర్స్‌లో డబ్బు పెట్టుకోవటానికి బీరువా తీస్తే పాస్‌బుక్ కన బడింది. చూస్తే, పదివేలు దాకా వుంది. ఫరవాలేదు దాంతో ఒక సంవత్స రం గడపొచ్చు. ఈ లోపులో పెరగొచ్చు.

పచ్చటి ఫియట్ కారుమీద సంధ్య ప్రతిబింబిస్తూంది.

"...ఎక్కడికి వెళదాం ?" స్టార్ట్ చేస్తూ అడిగాను.

"ఐ వాంట్ ఐస్ క్రీమ్ నాన్నగారూ."

"ష్యూర్, స్వీటీ."

"బజార్లో ఎందుకు- యింట్లో వుండగా ?" అరుణ కోప్పడింది.

నవ్వి "అదే హిపోక్రసీ" అన్నాను.

చీకటి పడింది. విశాలమైన రోడ్డుమీద మెత్తగా జారిపోతూంది కారు. రోడ్డు కిరువైపులా లైట్లు వెనక్కి వెళ్ళటాన్ని కుతూహలంగా గమనిస్తూంది పాప.

గాడ్గిన్ అండ్ సన్స్ ముందు ఆపాను.

"ఇక్కడెందుకు ?"

కారు తలుపు లాక్ చేస్తూ "రేపు నీ పుట్టినరోజు... మరిచిపోయావా బేబీ" అన్నాను.

ఇక్కడికి తీసుకొచ్చినందుకు కాదు— ఇన్ని పనుల మధ్య జ్ఞాప కం వుంచుకున్నందుకు.

"ఏం కొంటున్నారు ?"

"ఇన్‌సాలిడేటెడ్ కుకింగ్ అపరేటస్."

అరుణ పెద్ద పెద్ద కళ్ళల్లో సంభ్రమాశ్చర్యాలు.

"నిజమా !"

"చూస్తావుగా !"

అగర్వాల్ తన స్థూలకాయాన్ని కుర్చీలోంచి బరువుగా లేపి మొహంనిండా ఆనందాన్ని పులుముకుంటూ "ఆయియే సాబ్, ఆయియే" అన్నాడు.

అరగంటలో ఎన్నిక పూర్తయింది. స్టేట్స్ నుంచి ఇంపోర్టయినది ఇంటికి పంపుమని, చెక్ ఇచ్చి వచ్చాము.

కారు నడుపుతూంటే, చేతిమీద చెయ్యివేసి "థాంక్స్" అంది.

"ఎందుకు ?"

"ఎంతో పనినుంచి నన్ను రిలీఫ్ చేసినందుకు."

"భార్య అద్దాల షోకేస్‌లో బొమ్మలా వుండాలనుకోవటం భర్త స్వార్థం."

"ఉట్టి స్వార్థమే వుంటుంది చాలామంది మగవాళ్ళకి. కానీ ఆ కోర్కె తీర్చుకోవటం కోసం రాత్రింబవళ్ళు కష్టపడడం మాత్రం మీలాటి కొద్దిమందికే సాధ్యమవుతుంది. అందుకే భర్తగా కన్నా ఒక నిజమైన మగవాడిగా మిమ్మల్నెక్కువ ఇష్టపడతాను నేను."

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్..."

కారు మాండ్రిన్ ముందు ఆగింది.

సన్నటి వాద్యసంగీతం. చిరుచీకటి, పలచగా జనం. మౌనంగా తిరిగే వెయిటర్లు, మనసు రిలాక్సవుతూంది.

వెయిటర్ వైన్‌కార్డ్ అందించి నమ్రతగా నిలబడ్డాడు.

"లార్జ్ పెగ్ రమ్ ఫర్ ద ఆడమ్ అండ్ స్మాల్ జిన్ ఫర్ ద ఈవ్."

అరుణ పెదవులమీద విరిసీ విరియనట్టు చిరునవ్వు. "కాసెట్టా ఫర్ ఆపిల్ లైక్ బేబీ."

సంభాషణ పాప చదువువైపు మళ్ళింది.

"గ్రేవర్స్ కాన్వెంట్‌లో చేర్పిద్దాం"

అరుణ అనుమానంగా, "అక్కడ మినిష్టర్స్ కొడుకులకే దొరకటం కష్టం అట కదా" అంది.

"ప్రిన్స్‌పాల్‌కి నేనో విషయంలో సాయం చేశాను. ఆ కృతజ్ఞతతో ఇస్తాడు" అని పాపవైపు తిరిగి, "ఏం పాపా, వెళతావా" అన్నాను.

"ష్యూర్ నాన్నగారూ."

"ఇప్పుడున్నది వచ్చే సంవత్సరం మూసివేస్తారట."

వెయిటర్ ట్రేతో వచ్చాడు.

అరుణకి డ్రింక్స్ ఇష్టంలేదు. కానీ భర్త కోసం ఆ మాత్రం త్యాగం చెయ్యటంలో ఆనందం వుందని తెలుసు.

డిన్నర్ పూర్తిచేసి లేస్తూంటే అడిగాను.

"సెకండ్‌షోకి వెళదామా ?"

"ఇప్పుడా—చలిగాలి."

నవ్వి "కార్లో చలి ఏమిటి ?" అన్నాను.

అరుణ మాట్లాడలేదు. బయటకొచ్చేసరికి నిజంగానే చలిగాలి రివ్వున కొడుతూంది. గ్లాసులు బిగించి, చల్లటిగాలిలో నిర్మానుష్యమైన రోడ్డుమీద కారులోనే తిరగటం ఇష్టం అరుణకి. పాప కారులోనే నిద్రపోయింది.

ఇంటికొచ్చేసరికి పదకొండున్నర అయింది.

గారేజీలో కారుపెట్టి, నైట్‌గౌను మార్చుకుని వచ్చేసరికి డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చొని ఉడుకులాం మెడకి రాసుకుంటూంది అరుణ—అద్దంలోచూసి, నాలుక బయటపెట్టి వెక్కిరించింది.

పగలంతా ఎంతో మౌనంగా, రిజర్వ్‌డ్‌గా వుండే యీ అమ్మాయి ఈ గదిలోకి వచ్చేసరికి ఇంత అల్లరి ఎలా చేస్తుందో ఇన్నేళ్ళయినా నాకర్థం కాదు.

పొద్దున్న లేచేసరికి ఎనిమిదయింది.

బ్రేక్‌ఫాస్ట్ చేస్తుంటే టెలిగ్రాం వచ్చింది "రవి పెళ్ళిట."

"ఏం ఇద్దాం మీ తమ్ముడికి ప్రజెంటేషన్ ?" టై అందిస్తూ అడిగింది అరుణ.

ఆలోచించాలి.

"వెయ్యి-పదిహేనొందలకి తక్కువైతే బాగుండదు" అంది. ఆమె వైపు ఆప్యాయంగా చూశాను. "థ్యాంక్స్."

"ఎందుకు" ఆశ్చర్యంగా అడిగింది.

"అత్తవారింటికి సంబంధించిన విషయాల్లో ఆడవాళ్ళు నీలా వుండరు కాబట్టి."

అరుణ కళ్ళల్లో లీలగా మెదిలిన సిగ్గుని పెదవులతో లీలగా స్పృశించి గారేజివైపు నడిచాను.

ఆఫీసులో అడుగు పెడుతూంటే పదిన్నర అయినట్టు గడియారం గంట కొట్టింది.

ముందే ఎయిర్ కండిషన్ ఆన్ చెయ్యబడి వుండటం వల్ల గది చల్లగా వుంది.

కుర్చీలో కూర్చుని కారు తాళాలు జేబులో వేసుకోబోతూవుంటే, ఏదో గరుగ్గా తగిలింది.

తీసిచూస్తే రిజగ్నేషన్ లెటరు.

చింపి వేస్ట్ లెటర్ బాస్కెట్‌లో పడేసి పనిలో మునిగిపోయాను.

* * *

పొరపొరకి మధ్య మత్తుమందు నింపుకున్న వ్యవస్థ ఇది. మనసు కొద్దిగా కదిలితే మందుచల్లి జోకొడుతుంది.

అధవులదాకా ఎందుకు...